
కార్పొరేషన్‌లో పీఎఫ్ గోల్‌మాల్

- పీఎఫ్ ఖాతా నుంచి టీచర్ డబ్బులు డ్రా చేసుకున్నా పోస్టింగ్ వేయని వైనం
- ఇటీవల నగరపాలక సంస్థ అధికారికి ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయురాలు
- దీంతో షోకాజ్ నోటీసు జారీ చేసిన అదనపు కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఈపీఎఫ్(ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్) స్కాం ఇటీవల బయట పడింది. ఈ వ్యవహారంలో కార్పొరేషన్‌కు భారీ స్థాయిలో ఆర్థిక నష్టం వాటిల్లిందని కార్యాలయ సిబ్బంది చెప్పుకుంటున్నారు. ఇటీవల ఓ ఉపాధ్యాయురాలి ఫిర్యాదుతో ఈ స్కాం వెలుగులోకి వచ్చింది. ఈపీఎఫ్ ఖతా నుంచి డబ్బులు డ్రా చేసుకున్నా దానిని సదరు వారి ఖాతాలో విత్‌డ్రా చేసుకున్నట్లు పోస్టింగ్ వేయకపోవడం కార్యాలయంలో గత కొద్ది సంవత్సరాలుగా ఈ స్కాం జరుగుతుంది.

ఉద్యోగినికి షోకాజ్ నోటీసు

నగరపాలక సంస్థ పరిధిలో 268 పర్మినెంట్ ఉద్యోగులు, 405 ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు ఉన్నాయి. వీరిలో ప్రస్తుతం ఉపాధ్యాయులను విద్యాశాఖకు(డీఈఓ) అటాచ్ చేయడంతో వారంతా ఇప్పుడు తమ పీఎఫ్ ఖాతాలను సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో రవీంద్ర నగర్‌లో మున్సిపల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న రామాదేవి 2021లో తన ఈపీఎఫ్ ఖాతా నుంచి రూ.8,21,000 విత్‌డ్రా చేసుకున్నారు. అయితే సదరు సొమ్ము పీఎఫ్ ఖాతాలో విత్ డ్రా చేసుకున్నట్లు పీఎఫ్ సెక్షన్‌లో పనిచేసే రేణుకా దుర్గా భవానీ(ప్రస్తుతం ఆర్‌ఐగా పనిచేస్తున్నారు) పీఎఫ్ ఖాతాలో నమోదు చేయలేదు. సదరు టీచర్ లోన్ తీసుకున్నా లోన్ తీసుకోలేనట్లుగా పీఎఫ్ ఖాతాలో కనిపిస్తుంది. తన ఖాతాను సెటిల్‌మెంట్ చేసుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన సదరు టీచర్ విషయం తెలుసుకుని నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అదనపు కమిషనర్ దుర్గాభవానీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు.



రేణుకా దుర్గా భవానికి షోకాజ్ నోటీసు జారీ చేసిన అదనపు కమిషనర్(ఫైల్)

తెలియకుండా చాలానే ఉన్నాయి?

ఉద్యోగులు అత్యవసర పరిస్థితుల్లో(ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం, వివాహాలు, ఇతర శుభ కార్యాలు చేసుకునేందుకు) పొదుపు చేసుకున్న ఈపీఎఫ్ ఖాతా నుంచి లోన్ తీసుకుంటుంటారు. అయితే ఇందులో నిబంధనల మేరకు కొంత అమౌంట్ ఖాతాలో ఉంచి మిగిలిన అమౌంట్ వారికి అందజేస్తుంటారు. అయితే ఈ క్రమంలో చాలా మంది కార్పొరేషన్ నుంచి ఈపీఎఫ్ లోన్లు తీసుకున్నా వారి లోన్స్ వివరాలు అప్‌డేట్ కావనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి గాను సంబంధిత లోన్ తీసుకునే ఉద్యోగుల నుంచి మామూళ్లు తీసుకుని వాటిని పోస్టింగ్ వేయకుండా ఉంటున్నారని చెబుతున్నారు. తద్వారా ఓ ఉద్యోగి ఎన్నిసార్లు లోన్ తీసుకున్నా అక్కడ లోన్ తీసుకోనట్లుగానే కనిపిస్తుంది. దీని వలన కార్పొరేషన్ భారీ స్థాయిలో ఆర్థిక నష్టం వాటిల్లిందనే చెప్పుకోవచ్చు. దీనిపై అధికారులు నిశితంగా పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేకపోలేదని కార్యాలయ సిబ్బంది గుసగుసలాడుతున్నారు.

ఈ స్కాం నుంచి కాపాడేందుకు ప్రయత్నాలు

నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్ని స్కాంలు చేసినా తామకు కావాల్సిన వారైతే ఎటువంటి చర్యలు ఉండవు. లేదు అంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కార్యాలయ సిబ్బంది బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. పీఎఫ్ స్కాంలో సదరు మహిళ ఉద్యోగిని బయట పడేసేందుకు కమిషనర్ చాంబర్ అధికారులు నానా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. దీంతో పాటు ప్రస్తుతం పీఎఫ్ సెక్షన్ చూస్తున్న వ్యక్తిని మార్చాలనే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నలుగురు కలవడమే కవిత్వం



కార్యక్రమంలో కవులు

నగరంపాలెం: కవిత్వం రాసేటప్పుడు తీసుకున్న వస్తువుని ఏ కోణంలో నుంచి చూడాలో తమదైన దృష్టి కోణంతో ఆలోచించి కొత్తగా ఆవిష్కరించాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతినెలా నిర్వహిస్తున్న కవిత్వంతో కాసేపు విజయపురికాలనీ జీరో వీధిలో వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత సోమేపల్లి వెంకటసుబ్బయ్య స్వగృహంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని అధ్యక్షత వహించారు. డాక్టర్ భూసురపల్లి మాట్లాడుతూ సమకాలీన కవులలో కొంత మంది చక్కని కవిత్వాన్ని రాస్తున్నారని చెప్పారు. మంచి కవిత్వం రాయాలంటే అధ్యయనం బాగా చేయాలని సూచించారు. ఒక కవిత రాయాలంటే వంద చదవాలని రాసిన కవితని వందసార్లు చదివాలని అప్పుడే ఆ కవిత నిలబడుతుందని అన్నారు. సంఘ సభ్యులు శ్రీవశిష్ట, నానా, సుభానీ బెంగళూరులో పాల్గొన్న బుక్ బ్రహ్మ ఉత్సవం, ఏర్పాట్లు, వచ్చిన కవులు, రచయితలతో పరిచయాలు, వారి రచనలతో తమ అనుభూతులను పంచుకున్నారు. కవిత్వంతో కాసేపు కార్యక్రమంలో కవులు బండికల్లు జమదగ్ని, కొంతం నాగేశ్వరరావు, మెట్టు శ్రీనివాసరెడ్డి, తాటికోల పద్మావతి, సుభద్రాక్రిష్ణ, పింగళి భాగ్యలక్ష్మి, పింగళి గిరిభూషణ్‌రావు, రమణి సంబరాజు, ఎస్.రవికుమార్, నానా, శ్రీవశిష్ట సోమేపల్లి తమ స్వీయ కవితలతో పాటు సమకాలిన కవులు రాసిన కవితల్లో తమకు నచ్చిన కవితలను చదివి వినిపించారు. సోమేపల్లి కుటుంబ సభ్యులు కవులకు ఆతిథ్యమిచ్చారు.

తల్లీకుమార్తె ఆత్మహత్యాయత్నం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): తల్లీకుమార్తె ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలలు.. గుంటూరుకు చెందిన ఓ యువతి, యువకుడి ప్రేమించింది. అతడిని పెళ్లి చేసుకోవాలని ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. అందుకు తండ్రి అంగీకరించకపోవడంతో తండ్రీ కూతురు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో వారికి సర్దిచెప్పలేక తల్లి, కుమార్తెతో కలిసి ఆత్మహత్యాయత్నానికి విజయవాడ చేరుకున్నారు. ప్రకాశం బ్యారేజీ సమీపంలో కృష్ణానదిలో దూకుతున్నట్లు బంధువులకు ఫోన్‌చేసి చెప్పారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. బ్యారేజీ సమీపానికి చేరుకున్న పోలీసులు, కృష్ణవేణి ఘాట్ వద్ద తల్లీకుమార్తె ఉన్నట్లు గుర్తించారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు.

పరస్పర సహకారంతో సమృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలోని ఏ దేశమైనా విదేశాలతో సత్సంబంధాలను కలిగి ఉండటం ద్వారానే ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యాపార, వాణిజ్య రంగాల్లో స్వయం సమృద్ధి సాధిస్తున్నాయని అమెరికాలోని వర్జీనియాలో స్థిరపడిన ప్రవాస భారతీయురాలు కర్పూరపు హరితబాయి పేర్కొన్నారు. సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య- కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో బిజినెస్ ప్రమోషన్‌పై రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ సోమవారం ముగిసింది.

క్లుప్తంగా

పర్యావరణహిత చవితి వేడుకలకు సిద్ధం



నెహ్రూనగర్: మట్టి గణపతే మహా గణపతి అని ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు సిద్ధం కావాలని, ప్రధానంగా యువత కాలుష్యరహిత పండుగల నిర్వహణలో ముందు భాగాన ఉండాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ పర్యావరణహిత పండుగ చేసుకోవాలని రూపొందించిన వాల్ పోస్టర్‌ని కమిషనర్ తమ చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జైన్ హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎండీ మున్ను పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సోమవారం సంగడిగుంటలోని జైన్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్ను మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఐదేళ్లుగా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు రబ్బానీ, సరోజినీ, అనూష, అఖిల పాల్గొన్నారు.

వైద్య కళాశాల అభివృద్ధికి రూ.25 లక్షలు అందజేత



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల పెథాలజీ వైద్య విభాగం అభివృద్ధికి రూ.25 లక్షలను వైద్య కళాశాల 1997 బ్యాచ్ వైద్య విద్యార్థులు సోమవారం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జున కొండ వెంకటసుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌లను కలిసి విరాళం అందజేశారు. వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సాయం మరువలేనిదని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారీ అన్నారు. విరాళం అందజేసిన 1997 బ్యాచ్ వైద్య విద్యార్థులను అభినందించారు.


కుమారుడు అదృశ్యంపై ఫిర్యాదు



అశోక్ (ఫైల్)

నగరంపాలెం: తనయుడు కనిపించడంలేదంటూ తల్లి లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. లాలాపేట పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు.. ఆర్ అగ్రహారానికి చెందిన బేతంశెట్టి వెంకటలక్ష్మి క్యాటరింగ్ పనులు చేస్తుంది. సుమారు ఆరేళ్ల క్రితం భర్త మృతిచెందాడు. ఆమెకు అశోక్, సాత్విక్ సంతానం. ఈ ఏడాది జూన్ మూడో తేదీన పెద్ద కొడుకు అశోక్ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. స్థానిక పరిసరాలు, సమీప కుటుంబ సభ్యుల వద్ద వెదికినా ఆచూకీ తెలియలేదు. గతంలోనూ ఇంటి నుంచి వెళ్లిపోగా, రైల్వే పోలీసులు అప్పగించినట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ గుర్తించిన వారు 86888 31311 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

నగరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గంలోని 35వ డివిజన్ కృష్ణనగర్‌లో రూ.3.40 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు నగరంలో వార్డుల వారీగా ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. సదరు అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకుని ప్రారంభించడం జరుగుతుందన్నారు. నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు పనులను నిర్దేశిత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్జీల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, ప్రతి సోమవారం అర్జీల పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 18 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ ద్వారా 33 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 16, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 2, పరిపాలన విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలి..

ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి తీసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. సోమవారం నెహ్రూనగర్, ఆకులవారి తోట, అంకమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్రజలు తమ ఇళ్లల్లోని వ్యర్థాలను తడి పొడిగా వేరు చేసే ప్రజారోగ్య కార్మికులకు అందించాలన్నారు. కార్మికులు, కార్యదర్శులు ప్రజలకు వ్యర్థాల విభజన, హోం కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించాలన్నారు. నూతనంగా నిర్మాణాలు చేసే వారు నిర్దేశిత నిబంధనలు పాటించాలని, ఆ విధంగా చేయని వారి నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలు వేసేవారిపై నిఘా పెట్టి, అటువంటి వారిపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులకు తెలిపారు. పర్యటనలో డీఈఈ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే నివారించవచ్చు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల గ్యాలరీ హాలులో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు, ఎన్‌సీడీ 4.0 క్యాన్సర్ స్క్రీనింగ్‌పై రీ ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించడం వలన, జీవన కాలం పెరిగి, జీవన నాణ్యత పెరుగుతుందన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్, ప్రోటోకాల్ అమలు, వైద్యాధికారుల భూమికపై చర్చించారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల, బ్యానర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నేత్రదాన పక్షోత్సవాలు 25 ఆగస్టు నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేత్రదానం చేయడం వలన, మరణానంతరం కూడా, మన కళ్ళు జీవించి ఉండడంతోపాటు అంధులకు చూపును ప్రసాదిస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ నేత్రదానం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్సీడీ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ఎన్సీడీ కన్సల్టెంట్ గిరిధర్, వైద్యాధికారులు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ అబూబకర్, ఆప్తాలమిక్ ఆఫీసర్, డి.డి నాయక్, రహీమ్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

మోసానికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు



బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ స్కానర్లు ప్రదర్శిస్తున్న అంబటి, మోదుగుల, నూరిఫాతిమా

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, వెస్ట్ సమన్వయకర్త అంబటి రాంబాబు

నెహ్రూనగర్: మోసానికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు విమర్శించారు. నియోజకవర్గంలోని 34వ డివిజన్ కోబాల్ట్‌పేటలో కార్పొరేటర్ బూసి రాజలత ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు మాట ఒక అబద్ధమని, పరిపాలన ఒక మోసమని మండిపడ్డారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో ఏ ఒక్కరోజు ఇచ్చిన మాటకు కట్టుబడిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో అడ్డూ అదుపు లేని హామీలు ఇచ్చి ప్రజలను దగా చేసిన గొప్ప నాయకుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. బాబూ ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి కూటమి అబద్ధపు వాగ్దానాలను తెలియజెప్పాలన్నారు. ఈ మహత్తర బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పిలుపునిచ్చారు. పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ నయవంచన అనే పేరుకు నిలువెత్తు రూపం చంద్రబాబు అని మండిపడ్డారు. సూపర్- 6 అంటూ లేనిపోని హామీలు ఇచ్చి, అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కారని విమర్శించారు. ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని, ఇదేమని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టడం సిగ్గుచేటన్నారు. రానున్నరోజుల్లో చంద్రబాబు సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ జీవితం ప్రారంభమైన నాటి నుంచి దగా, వెన్నుపోటుతోనే ముందుకు సాగారన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. దీన్ని ప్రజలకు వివరించి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి అందించిన తీరు, కూటమి పాలకులు వ్యవహరిస్తున్న తీరును తెలియజెప్పాలన్నారు. కూటమి పాలనలో అధిక శాతం మోసపోయిందని మహిళలేనని తెలిపారు. దీనిపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకట కృష్ణ(ఆచారి), గోపి శ్రీనివాస్, పోలవరపు జ్యోతి, దూపాటి వంశీ, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ సైదాఖాన్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు దానం వినోద్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నందేటి రాజేష్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్, జగన్ కోటి, రజీయాబేగం పాల్గొన్నారు.

అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- విచారణకు పిలిచి వేధిస్తున్నారంటూ ఆవేదన
- ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఘటన
- జీజీహెచ్‌లో చికిత్స పొందిన బాధితురాలు



బాధితురాలు దివ్య

లక్ష్మీపురం: మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అరండల్ పేట పోలీస్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు... నల్లచెరువు ప్రాంతానికి చెందిన మరబోయిన దివ్య, యాక్సెస్ బ్యాంక్ గోల్డ్‌లోన్ డెప్యూటీ మేనేజర్‌గా పని చేస్తోంది. భర్త శివనాగరాజు అరండల్‌పేటలోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన సింగంశెట్టి శ్రావణ సంధ్య 2022 నుంచి గుంటూరు బ్రాడీపేటలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. దివ్యతో కలిసి బంగారాన్ని తక్కువ వడ్డీకి తాకట్టు పెట్టి డబ్బులు ఇప్పిస్తానని చెప్పి నమ్మబలికి బంగారాన్ని అరండల్‌పేటలోని రమేష్ బ్యాంకర్స్ అనే తాకట్టు షాపులో తాకట్టు పెట్టింది. వెంగళాయపాలేనికి చెందిన కారుమూరి నవమ్మకు చెందిన బంగారాన్ని కూడా తాకట్టు పెట్టింది. కొంత కాలం తరువాత దివ్య, సంధ్యారాణిలకు తెలిసిన వెంగళాయపాలేనికి చెందిన అనీల్‌తో కలిసి రమేష్ బ్యాంకర్స్‌లో తాకట్టు పెట్టిన బంగారానికి సంబంధించిన డబ్బును దివ్య చెల్లించి బంగారాన్ని విడిపించింది. విడిపించిన బంగారాన్ని దివ్య భర్త శివనాగరాజు పనిచేసే ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో శివనాగరాజు పేరుతో సంధ్య, నవమ్మల బంగారం తాకట్టు పెట్టి వచ్చిన డబ్బును దివ్య తీసుకుంది. ఈ విషయమై సంధ్య, దివ్యను బంగారం గురించి అడుగగా బంగారం తాకట్టు దుకాణంలో వేలంకు వెళ్లిందని చెప్పింది. ఈ విషయమై సంధ్య విచారించగా ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో దివ్య భర్త నాగరాజు పేరుతో తాకట్టు పెట్టి మళ్లీ దానిని అక్కడ నుంచి విడిపించి పట్నంబజార్‌లోని కీర్తన బ్యాంక్‌లో తాకట్టు పెట్టినట్లు నిర్ధారించుకుంది. ఈ విషయమై దివ్య, సంధ్యల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో సంధ్య, దివ్యపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

దివ్యను వేధిస్తున్న అరండల్‌పేట పోలీసులు..

ఎస్ఐ జె.వి.నరసింహారావు కేసు విచారణ చేస్తున్నారు. ఇరువర్గాలను పిలిపించి జరిగిన విషయంపై విచారణ ప్రారంభించారు. విచారణలో భాగంగా పది రోజులుగా నిత్యం దివ్యను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించడం ప్రారంభించారు. బంగారం సంధ్యకు అప్పగించాలని హెచ్చరించారు. దీంతో బాధితురాలు అరండల్‌పేట ఎస్ఐ నరసింహారావు వేధింపులతో పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి విచారణకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ సిబ్బంది సహాయంతో హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించి విషయాన్ని గోప్యంగా ఉంచారు. జీజీహెచ్‌లో చికిత్స అనంతరం బాధితురాలు ఆసుపత్రి ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ బంగారం తాకట్టు విషయంలో అరండల్‌పేట పోలీసులు, బ్యాంక్ సిబ్బంది ఇద్దరు కుమ్మక్కై రూ.2.50 లక్షలు వసూలు చేయడమే కాకుండా ఎస్ఐ రూ.35 వేలు అడిగినట్లు చెబుతోంది. నా దగ్గర లేవు అని చెప్పిన ఎలాగైనా తీసుకురావాలని బెదిరించగా దీంతో దిక్కుతోచక ఆత్మహత్యాయత్నం చేసినట్లు పేర్కొంది.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వెస్ట్ డీఎస్పీ అరవింద్

లక్ష్మీపురం: చట్ట వ్యతిరేక పనులకు గాని, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు కఠినంగా ఉంటాయని వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ అన్నారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కె.వి.పి కాలనీలో డీఎస్పీ పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, ప్రధానంగా గంజాయి, దొంగతనాలు, వంటి నేరాలు చేసినట్లు ఉంటే చట్ట పరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. స్థానికంగా ఉండే రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్స్, గంజాయి కేసుల్లో నిందుతులు, దొంగతనాలకు పాల్పడిన వారి పై పోలీస్ నిఘా ఉందన్న విషయాన్ని మరువద్దన్నారు.



కె.వి.పి.కాలనీలో పర్యటిస్తున్న వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్

27న ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: రెవ. డాక్టర్ పి.ఎన్.ఎస్.చంద్రబోస్ 76వ జయంతి సందర్భంగా ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రాణి తెలిపారు. స్థానిక సీతమ్మ కాలనీ 4వలైను షాలేం నగర్‌లోని యెహోవా షాలేం మందిరంలో బుధవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

నగరంపాలెం: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గుంటూరు ప్రజలకు మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షుడు కె.విజయకృష్ణ, కార్యదర్శి జి.వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 సాయంత్రం ఐదు గంటలకు బృందావన్‌గార్డెన్స్ సిరి స్వీట్ దుకాణం, కొరిటెపాడు వద్ద అందిస్తామని పేర్కొన్నారు. కాలుష్య రహితమైన ప్రతిమలతో మహా గణనాథుడిని పూజించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): యాదవ బజార్ 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ పీహెచ్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట కరెంట్ ఉండదని చెప్పారు. యాదవ్ హైస్కూల్ ప్రాంతం, అల్లీ నగర్, సత్యనారాయణ స్వామి గుడి ప్రాంతం, బూరెల వారి వీధి, కృష్ణుడి కళ్యాణ మండపం, యాదవ బజార్, బాలాజీ నగర్ 7వ లైన్ నుంచి 11వ లైన్ వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.